Fashion

• సమతా చౌదరి, డిజైనర్
wowobySamathachowdari

తెలుపు.. తళుకు

చంద్రకాంతుల పోగువేసి, బంగారపు తీగల జరీ చేసి నేశారా అనిపిస్తుంది తెలుపు రంగు చీరను చూస్తే. ఇక అందులోనూ వెన్నెల వన్నెలన్నీ పోగేసినట్టు కనిపించే ఆడపిల్లకు అది అలంకారమైతే అందమే అచ్చెరువొందడం ఖాయం. శరీరానికి హాయిగా ఉండే లినెన్ వస్త్రానికి బంగారు రంగు టిష్యూ అంచు వచ్చేలా రూపొందించారీ చీరను. ఇప్పటి ట్రెండ్‌కు తగ్గట్టు కిందివైపు పెద్ద అంచు, పైవైపు చిన్న అంచు వచ్చేలా నేసిన ఈ చీరకు ఫ్యాషనబుల్ స్లీవ్‌లెస్ బ్లౌజ్ జతచేశారు. సంప్రదాయానికి ఫ్యాషన్ సొబగులు అద్దడమంటే ఇదే అన్నంత ముచ్చటగా కుదిరిందీ జోడీ.

సకలకళా వల్లభురాలు!

నార్త్లో నుంచొట్లో

మాన్సి అగర్వాల్. బాలీవుడ్‌లో సుపరిచితమైన పేరు. చిన్నప్పటి నుంచి నృత్యం అంటే ప్రాణం. అందుకే అర్థశాస్త్రంతోపాటు నాట్యంలోనూ డిగ్రీ అందుకున్నారు. కొరియోగ్రాఫర్‌గా మారిపోయి.. అనేక గీతాలకు నృత్య కల్పన చేశారు. దేవ్ డి, మేరీకోమ్, గులాల్.. లాంటి పాపులర్ చిత్రాలకు కొరియోగ్రఫీ అందించారు. డ్యాన్స్ మాత్రమే కాదు... దర్శకత్వంలోనూ తనది అరుదైన ప్రతిభే. ఆమె నిర్మించి, దర్శకత్వం వహించిన 'రాణి', 'హ్యాండ్ బ్యాగ్' లఘుచిత్రాలు అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో చోటు దక్కించుకున్నాయి. మాన్సికి తొమ్మిదేళ్లు ఉన్నప్పుడు.. సకుటుంబంగా జురాసిక్ పార్క్ సినిమాకు వెళ్లింది. అదొక మాయాలోకంలా అనిపించింది. ఆ తర్వాత క్రిస్టఫర్ నోలన్ చిత్రాలు... తనలో సినీరంగం పట్ల ఆసక్తిని పెంచాయి. వెండితెర మీద మరింత పట్టు సాధించేందుకు అకిరా కురోసావా లాంటి ప్రముఖ దర్శకుల చిత్రాలను విశ్లేషించడం మొదలుపెట్టారు మాన్సి. చివరికి తనకు ఇష్టమైన రంగంలో కొరియోగ్రాఫర్, నిర్మాత, దర్శకురాలిగా గుర్తింపు అందుకున్నారు. మాన్సి ఈమధ్యనే 'ఓషనిక్ హార్ట్స్' అనే తొలి నవలను ఆవిష్కరించారు. తన జీవితంలో ఎదురైన అనుభవాలకు కాల్పనికతను జోడించి రాసిన ఈ పుస్తకం కూడా విమర్శకుల మెప్పు పొందుతున్నది.

చిన్నచూపు ఎందుకు?

డియర్ జిందగీ

నా బాల్య స్నేహితురాలి పేరు ప్రియ. పాఠశాల రోజుల నుంచీ మేం బెస్ట్ ఫ్రెండ్స్. కలిసే కాలేజీకి వెళ్లాం. ఒకే రోజు తొలి ఉద్యోగంలో చేరాం. నా సలహా తీసుకున్న తర్వాతే పెళ్లి చేసుకుంది. కానీ, తల్లి కాగానే తన ఆలోచనలు మారాయి. కావాలనే నన్ను దూరం పెడుతున్నది. ఫోన్ చేసినా పెద్దగా స్పందించదు. పాపతో బిజీగా ఉన్నానంటూ కట్ చేస్తుంది. కానీ మిగిలిన వాళ్లతో బాగానే ఉంటుంది. ఎందుకిలా? నేను గొడ్రాలిననే చిన్నచూపా?

• ఓ పాఠకురాలు

పిల్లలతోపాటే అమ్మ కూడా పుడుతుంది. బిడ్డ తొమ్మిది నెలలు గర్భంలో ఉంటాడు. తల్లి తొమ్మిది నెలలు గర్భాన్ని మోస్తుంది. పెద్ద ప్రాణానికైనా, చిన్న ప్రాణానికైనా అదో గండమే. ఆ సమయంలో తల్లి అనేక మానసిక, శారీరక సమస్యలు ఎదుర్కొంటుంది. ఆ ప్రభావాల్లో ఇదీ ఒకటి కావచ్చు. కొంతకాలం పాటు తనను తనలా ఉండనివ్వండి. తన ప్రపంచంలో తనను బతకనివ్వండి. ఇతర మహిళలతో ఆమె మాట్లాడటానికి కారణం.. వారి నుంచి పిల్లల పెంపకానికి సంబంధించిన చిట్కాలు నేర్చుకోవడమే కావచ్చు. తను నిజంగా బాధ్యతల్లో తలమునకలై ఉంటే.. మీ వంతుగా ఏమైనా సాయం చేయగలరేమో ఆలోచించండి. అంతేకానీ, ఆ బాలింతను అపార్థం చేసుకోవద్దు. స్నేహితురాలిని దూరం చేసుకోవద్దు.

పళ్లు.. రాల్తయ్!

ఏ ఇద్దరి వేలిముద్రలూ ఒకేలా ఉండవు. దంతాలూ అంతే. చాలా భిన్నంగా ఉంటాయి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా పంటి సమస్యలు, చిగుళ్ల వాపులు అసౌకర్యం కలిగిస్తాయి. శాశ్వతంగా దెబ్బతినే ప్రమాదమూ ఉంది. 'నేషనల్ ఓరల్ హెల్త్ ప్రోగ్రాం' లెక్కల ప్రకారం మనదేశంలో 95 శాతం మంది ఏదో ఒక చిగుళ్ల సమస్యతో బాధపడుతున్నారు. పదిహేనేళ్లలోపు పిల్లల్లో కనీసం 70 శాతం మందికి పంటి ఇబ్బందులు ఉన్నాయి. ఈ సమస్యల నుంచి తప్పించుకోవడానికి నిపుణుల సూచనలు..

- పిల్లలకు స్వీట్స్, పండ్ల రసాలు తక్కువగా ఇవ్వాలి. తీపి పదార్థాలు ఇవ్వాలనుకుంటే, భోజనం సమయంలో ఇవ్వొచ్చు. దీని వల్ల నేరుగా పళ్ల మీద ప్రభావం ఉండదు.
- బ్రేక్‌ఫాస్ట్ తర్వాత బ్రష్ చేసుకోవడం చెడు అలవాటు. దానివల్ల రాత్రి పేరుకున్న బ్యాక్టీరియా ప్రభావం చూపడమే కాకుండా... అల్పాహారంలో తిన్న పదార్థాలు కూడా పళ్లను దెబ్బతీస్తాయి.
- బ్రష్ చేయడం వల్ల 60 శాతం పళ్లు మాత్రమే శుభ్రపడతాయి. పళ్ల మధ్య గారను శుభ్రం చేసే ఫ్లాసింగ్ ప్రక్రియతో నోటిలోని బ్యాక్టీరియా తగ్గుతుంది.
- సున్నితమైన పళ్లు ఓ సమస్య మాత్రమే కాదు. దంతాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి అనేందుకు సూచన కూడా. ప్రత్యేకమైన పేస్ట్ వాడితే సరిపోదు. దంత వైద్యుడిని సంప్రదించాలి. లేదంటే, పళ్లు రాల్తయ్.. అదే, ఊడిపోతయ్.

అమ్మ చారు.. నాన్న సితారు!

పండిట్ రవిశంకర్ ముద్దుల తనయ.. అనౌష్క శంకర్ హైదరాబాద్ రాబోతున్నారు. కచేరీ చేయబోతున్నారు. జంటనగరాలను ఉర్రూతలూగించబోతున్నారు. ఈ సందర్భంగా మీడియాతో ముచ్చటించారు. మనసులోని భావాలు పంచుకున్నారు.

Anoushka Shankar

నచ్చిన వంట

అమ్మ దక్షిణాది మహిళ. తన చేతికి ఏదో మహత్తు ఉందనిపిస్తుంది. కొబ్బరి తురుము వేసిన బీన్స్ కూర అద్భుతంగా వండేది. చారు అయితే అమృతమే. ఆ రుచి ఏ స్టార్ హోటల్‌లోనూ దొరకదు.

సినిమా సంగీతం

గతంతో పోలిస్తే చాలా మారింది. మ్యూజిక్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. మంచి అవకాశం లభిస్తే తప్పక అంగీకరిస్తాను.

కొత్త ఆల్బమ్

'చాప్టర్–వన్ : ఫరెవర్, ఫర్ న్యూ' నా సరికొత్త ఆల్బమ్. ఇది నా హృదయావిష్కరణ. మీ ఆశీస్సులు కావాలి. గతంలో వచ్చిన ఆల్బమ్స్‌కు భిన్నంగా ప్రయత్నించాను. సరికొత్త ట్యూన్స్ జోడించాను.

సితార్ కాకుండా..

పియానో నేర్చుకున్నాను. మిగతా వాద్యాలనూ ఆస్వాదిస్తాను. ఏదైనా సితార్ తర్వాతే. ఏ గురువు అయినా నాన్న తర్వాతే.

ఎందరో మహానుభావులు

భారతదేశంలో ఎంతోమంది కర్ణాటక సంగీత విద్వాంసులు ఉన్నారు. చేయి తిరిగిన వాద్యకారులూ ఉన్నారు. వాళ్లందరితో కాకపోయినా.. ఒకరిద్దరితో అయినా కలిసి పనిచేయాలని నా కోరిక.

స్టార్టప్ స్టోరీస్

వ్యవసాయ కూలీగా బతకడం ఆమెకు ఇష్టం లేదు. తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు కావాలి. తనదైన ప్రతిభను నిరూపించుకోవాలి. అదే ఆమె తపన. తన భర్త లానే తాను కూడా సంప్రదాయమైన నకాషీ (చేర్యాల చిత్రకళ)లో అడుగు పెట్టింది. చేతివృత్తులకు కాలం చెల్లుతున్న తరుణంలో... వైవిధ్యమైన కళా ప్రతిభతో నైపుణ్యాన్ని సాధించింది. అక్కడితో ఆగిపోకుండా, కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన ఆంత్రప్రెన్యూర్‌షిప్ వేదిక.. వీహబ్ సాక్షిగా తనలోని కళాకారిణికి తుది మెరుగులు దిద్దుకున్నది. ఆ ఆత్మవిశ్వాసంతోనే రైతుకూలీగా మారాల్సిన పరిస్థితి నుంచి.. ఇరవై మందికి ఉపాధినిస్తూ కళా వ్యాపారిగా రాణిస్తున్న పశుల మంగ స్టార్టప్ స్టోరీ ఈ వారం..

మంగమ్మ శపథం!

'కూలి పని చేయనుగాక చేయను. కళాకారిణిగా పెద్ద పేరు తెచ్చుకుంటాను. ఆ సంపాదనతోనే నా కుటుంబాన్ని పోషిస్తాను'.. అని ప్రతిన పూనింది ఓ మంగమ్మ. ఎవరా మంగమ్మ? ఏమిటా శపథం అంటారా? అయితే, చదవండి. అదొక గెలుపు గాథ.

చేర్యాల చేతివృత్తులకు అంతర్జాతీయంగా ఆదరణ ఉంది. కానీ ఆ ప్రాచీన కళపై ఆధారపడుతున్న వారి జీవితాలకు మాత్రం భరోసా లేకుండా పోయింది. ఆ పరిస్థితుల్లో కూడా తాతముత్తాతల నాటి పనితనం తప్పించి, మరో పని తెలియని భర్త మల్లేష్‌కు చేదోడుగా నిలవాలని భావించింది పశుల మంగ. మొగుడి సహకారంతో నకాషీ చిత్రకారుడు వెంకయ్య కుటుంబం వద్ద శిక్షణ పొందింది. తనకు ఏ మాత్రం సంబంధం లేని రంగుల రంగంలో అడుగు పెట్టింది. అనతి కాలంలోనే నైపుణ్యం సాధించింది. అంతటితో ఆగకుండా తన లాంటి మరో ఇరవై మందికి జీవనాధారం కల్పిస్తున్నది. కాలం గడిచేకొద్దీ మంగ ప్రతిభ హద్దులు దాటింది. దాంతోపాటు మార్కెట్ కూడా విస్తరించింది. ఆ రాబడి ఇద్దరు కూతుళ్ల చదువులకు పనికొచ్చింది. కుటుంబ నిర్వహణకు ఆసరాగా నిలిచింది.

వీహబ్ భరోసా

చేర్యాల కళాకృతులకు ప్రజల్లో గుర్తింపు ఉంది. కానీ, కష్టమర్ల వరకూ తీసుకెళ్లేందుకు బలమైన మార్కెట్ వ్యవస్థ లేకపోవడం పెద్ద అవరోధం. ఎంతోమంది గ్రామీణ మహిళలను చిరు వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించిన వీహబ్.. చేర్యాల కళ పునరుజ్జీవనంలో తనవంతు పాత్ర పోషించింది. మంగకు మార్కెటింగ్ మెలకువల తోపాటు, బ్రాండింగ్, సమకాలీన డిజైన్ల ఎంపిక, తయారీలో ఆధునికత.. తదితర అంశాలు నేర్పింది. ఆ శిక్షణ తనకెంతో సాయపడిందని సంబురంగా చెబుతున్నది మంగ. గతంలో ఆమె నెలవారీ ఆదాయం పదివేల లోపే ఉండేది. వీహబ్ పుణ్యమాని రాబడితోపాటు కొనుగోళ్లూ పెరిగాయి.

సంప్రదాయ కళకు గుర్తింపు..

గతంలో చిత్రకళకు మాత్రమే పరిమితమైన చేర్యాల శైలికి సృజనాత్మకతను జోడించి కార్పొరేటైజ్ చేయడంతో మంగ వ్యాపారానికి విస్తృతమైన ఆదరణ లభించింది. కొత్తగా గణపతి, రాజారాణి, అర్ధనారీశ్వర, కాటమరాజు, గంగాదేవి, మల్లన్న బొమ్మల తోపాటుగా కీచైన్లు, వాల్ స్టిక్కర్లు, పెన్ స్టాండ్లు, ఫొటో ఫ్రేమ్‌లను కూడా తయారు చేస్తూ వ్యాపార పరిధిని పెంచుకున్నది మంగ. దీంతోపాటు కొత్త ఏడాది, దీపావళి తదితర సందర్భాల్లో కార్పొరేట్ సంస్థల నుంచి గిఫ్ట్ ఆర్టికల్స్ కోసం భారీ ఆర్డర్లు వస్తున్నాయి. ఒకరిని చూసి ఒకరు ముందుకొస్తున్నారు. దీంతో చేర్యాల ప్రభ మరింత పెరిగింది. మెటీరియల్ కొనుగోలు, జీతభత్యాలు, వ్యాపార విస్తరణ ఖర్చులు పోగా మిగిలిన పైసలతో కుటుంబాన్ని సమర్థంగా పోషించుకునే వీలు కలిగింది. చేతినిండా ఆదాయం సమకూరింది. ప్రభుత్వం నుంచి మరింత పెట్టుబడి అందితే.. వ్యాపారాన్ని ఇంకొంత పెంచుకుంటామని ఆశగా

అడుగుతున్నది మంగ. ఆ పట్టుదలే ఉమెన్ లీడర్‌షిప్ అవార్డ్, నేషనల్ కల్చరల్ ఫెస్టివల్ అవార్డ్, జిల్లా, రాష్ట్ర స్థాయి ఉత్తమ పారిశ్రామికవేత్త అవార్డుతోపాటు వివిధ పురస్కారాలను, ప్రశంసలను తెచ్చిపెట్టింది. 'నేను పడిన కష్టానికి వీహబ్ ప్రోత్సాహం తోడవడంతోనే ఇదంతా సాధ్యమైంది. ఆ వేదిక నా జీవితాన్ని మార్చింది. అంతరించిపోతున్న కళనూ బతికించింది' అని చెబుతున్నప్పుడు ఆ చేర్యాల చిత్రకారిణి కళ్లల్లో ఆనంద బాష్పాలు. అవి మార్పు సంకేతాలు, ఆత్మవిశ్వాస ఆభరణాలు.

కడార్ల కిరణ్

జీవితంలో కష్టాలు ఉంటాయి. అవరోధాలు ఎదురవుతాయి. సవాళ్లు మనల్ని నిలువరించే ప్రయత్నం చేస్తాయి. అయినా ఆగిపోకూడదు. వెనుదిరగకూడదు. ఓటమిని అంగీకరించకూడదు. ఎదురుతిరగాలి. మనల్ని మనం సరికొత్తగా తీర్చిదిద్దుకోవాలి. అప్పుడే, లక్ష్యాన్ని చేరుకుంటాం. కుటుంబాన్ని పోషించుకుంటాం. సమాజంలో గౌరవంగా నిలబడగలుగుతాం.

• పశుల మంగ

మామిడి చిగురు పచ్చడి

కావలసిన పదార్థాలు:
మామిడి చిగురు: అర కప్పు, **చిన్న ఉల్లిపాయలు:** అర కప్పు, **పచ్చికొబ్బరి తురుము:** అర కప్పు, **పచ్చిమిర్చి:** నాలుగు, **ఎండు మిర్చి:** రెండు, **అల్లం:** చిన్న ముక్క, **ఉప్పు:** తగినంత, **కరివేపాకు:** ఒక రెబ్బ, **పోపు గింజలు:** అర టీ స్పూన్, **నూనె:** ఒక టేబుల్ స్పూన్.

తయారీ విధానం:
ముందుగా మిక్సీ జార్‌లో మామిడి చిగురు, ఉల్లిపాయలు, కొబ్బరి తురుము, పచ్చిమిర్చి, అల్లం, తగినంత ఉప్పు వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఇప్పుడు స్టవ్ మీద కడాయి పెట్టి ,నూనె వేసి వేడయ్యాక పోపు గింజలు, కరివేపాకు, ఎండుమిర్చి వేసి, వేగాక పోపును పచ్చడిలో కలిపితే సరి. మామిడి చిగురు పచ్చడి రెడీ.